పేదల సంక్షేమానికి పెద్దపీట

● గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
● గుమ్మితం తండాలో కార్యక్రమానికి విశేష స్పందన


సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బ్రాహ్మణపల్లె సచివాలయ పరిధిలో గల గుమ్మితం తండాలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచు జయ భారతమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథగౌడుతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో చేకూరిన లబ్ధిని వివరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్‌కార్డు కల్గిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తేవాలని సూచించారు. గ్రామ సమీపంలో నిర్మిస్తున్న సోలారు పరిశ్రమ ద్వారా తమకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, తాము మాత్రం ఊరు విడిచి వెళ్లమని స్థానికులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశంపై మరోసారి చర్చించుకుని ఏకాభిప్రాయంతో తన వద్దకు రావాలని సూచించారు. అంతకు ముందు ఎమ్మెల్యే స్థానిక దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక నాయకులు నారాయణ నాయక్, కేశాలు నాయక్, బద్దునాయక్, బీమ్లానాయక్, రవినాయక్, లాలునాయక్, నాగేశ్వరరెడ్డి, బలరాముడు, రాజశేఖరచౌదరి, పెద్దన్న, బీసీ రవికుమార్, దేవరాజు, శివశంకర్‌పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఓర్వకల్లు: ఆలయాలు పదికాలాల పాటు పదిలంగా ఉండేందుకు నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కన్నమడకల గ్రామంలో శనివారం వేణుగోపాలస్వామి నూతన ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసానితో పాటు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా ఆయన ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుడిలో భద్రపరచిన శంకాన్ని ఎమ్మెల్యే తలపై పెట్టుకుని నూతన ఆలయ నిర్మాణ ప్రదేశానికి తీసుకెళ్లారు. అక్కడ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన ఆలయ నిర్మాణానికి రూ.40 లక్షలు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నిధులు సరిపడకపోతే దాతల సహకారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మద్దిలేటి, సర్పంచు పెద్ద కాశీం, ఎంపీటీసీ సభ్యులు సోమశేఖర్‌రెడ్డి, ఆలయ అర్చకులు చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


బండలాగుతున్న ఎద్దులు

ఓర్వకల్లు: పెద్దమ్మ జాతర సందర్భంగా గుమ్మితం తండాలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు పోటీలు నిర్వహించారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను ఎమ్మెల్యే కాటసాని ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో మొత్తం ఎడ్లజతల ఎడ్లు పాల్గొనగా బీరం బుల్స్, ఎస్ కొత్తూరుకు చెందిన సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి వృషభాలు(ఉభయ జత) నిర్ణీత సమయానికి 4,751 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతిగా రూ.30 వేలు గెలుచుకున్నాయి. గద్వాల జిల్లా రాయవరం రామచంద్రారెడ్డి వృషభాలు 4,344 అడుగుల దూరం లాగి రెండవ స్థానంలో రూ.20 వేలు, నంద్యాల జిల్లా డి. రంగపురానికి చెందిన జూటూరు రమచంద్రారెడ్డి ఎడ్లు 4317 అడుగుల దూరం లాగి మూడో స్థానంలో రూ.15 వేలు, మల్యాలకు చెందిన షేక్ మైమున్నా, పెండేకల్‌కు చెందిన నాగభూషణం వృషభాలు (ఉభయ జత) 4,009 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో రూ.10 వేలు, వెల్దుర్తి మండలం, కలుగోట్ల గొంది బజారి ఎడ్లు 3,721 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో నిలిచి రూ.5 వేలు నగదు బహుమతులు పొందాయి. ఈ పోటీలకు వాడాల రామనాయుడు, అబ్దుల్ కలాం న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో స్థానికులు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


బురాన్‌దొడ్డి లేఅవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ సుమంత్

సి.బెళగల్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ సుమంత్ అన్నారు. శనివారం హౌసింగ్ సిబ్బందితో కలిసి మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో పర్యటించి లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. నిర్మాణాలు మొదలు పెట్టని వారు త్వరగా ప్రారంభించాలని సూచించారు. లేకపోతే రద్దు అవుతాయన్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, వీఆర్వో పాండురంగయ్య, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ రంగన్న పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి


సి.బెళగల్ ఆర్బీకేలో కియోస్కో పనితీరును పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి వారికి అవసరమైన సేవలను సకాలంలో అందించాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని సి.బెళగల్, పోలకల్ గ్రామాల్లో పర్యటించి స్థానిక ఆర్బీకేలను సందర్శించారు. రికార్డులు, ఎరువులు, మందులు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా పరిశీలించారు. కియోస్కో పనితీరుపై ఆరా తీసి ఎరువులు, విత్తనాల నిల్వల రికార్డులను నమోదు చేయించారు. రబీ పంటల నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. రెగ్యులర్‌గా గ్రామాల్లో పర్యటించి పంట సాగులో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరు రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర శివారులోని ఏపీ కార్బైట్స్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న 220కేవీ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌కో అధికారులు పనులు చేపడుతున్న కారణంగా గాయత్రి ఎస్టేట్, బిర్లాగడ్డ, ఠాగూర్ నగర్, లక్ష్మీ నగర్, మద్దూరు నగర్, బీ.క్యాంప్, సీ. క్యాంప్, గణేష్ నగర్, రెవెన్యూ కాలనీ, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కాలనీ, సాయి వైభవ్ నగర్, నంద్యాల చెక్‌పోస్టు ఏరియా, శేషాద్రీ నగర్, పోస్టల్ కాలనీ, మారుతి మెగా సిటీ, బృందావన్ నగర్, మారుతి నగర్, అరుంధతి నగర్, టెలికాం నగర్, గఫూర్ నగర్, పార్థసారథి నగర్, కమలా నగర్, రామచంద్ర నగర్, రామకృష్ణ నగర్, గుత్తి రోడ్డు, శరీన్ నగర్, అబ్బాస్ నగర్, కృష్ణ నగర్, మిలటరీ కాలనీ, గార్గేయపురం, దిగువపాడు, శివరాంపురం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సచివాలయాల తనిఖీ

సి.బెళగల్: పోలకల్, బురాన్‌దొడ్డి గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీఓ రాముడు శనివారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఉద్యోగులతో మాట్లాడా రు. విధుల నిర్వహణలో సమయపాలన పాటించాలని సూచించారు. ఆయుష్మాన్ భార త్, రైతు భరోసా లబ్ధిదారుల వివరాల నమో దుకు సంబంధించిన సర్వేను వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు సునీల్ రాణి, విక్రమ్, షఫీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డును కప్పేసిన కంప



పాణ్యం: మండల కేంద్రం పాణ్యం–రసూళ్లపేట దారిని కంప చెట్లు పూర్తిగా కప్పేశాయి. దీంతో ఈమార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కనే ఎస్సార్బీసీ కాల్వ గట్టు ఉండటంతో దానిపై ముళ్ల కంప ఏపుగా పెరిగిపోయి రోడ్డు వైపు విస్తరించింది. దాదాపు 3 కిలోమీటర్ల వరకు ఇదే పరిస్థితి ఉంది. స్థానిక అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించాలని పాణ్యం, రసూళ్లపేట గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అడిగిన వారందరికీ 'ఉపాధి'

కోడుమూరు: గ్రామాల్లో వలసల నివారణకు అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఆయన కోడుమూరులోని మండల పరిషత్ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో ఉపాధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పనుల కల్పనలో పురోగతిపై చర్చించారు. గ్రామాల్లో గుర్తించిన పనులను ఇకపై రెగ్యులర్‌గా కూలీలకు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూలీలకు దినసరి వేతనం రూ.250 లభించేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీఓ రమాదేవి, ఈసీ వెంకటేశ్వర్లు, టీఏలు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

● గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు: జనరంజక పాలన అందిస్తున్న వైఎస్ జగనన్నను వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని 6వ వార్డు లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ఎమ్మెల్యే తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే తపనతో పలు పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారన్నారు.ఈ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ సీఎంగా ఉండాలన్నారు. మూడున్నరేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి సేవల్లో దేశంలోనే ఏపీని అగ్ర స్థానంలో నిలబెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, సచివాలయాల కన్వీనర్ ఎల్.వెంకటేశ్వర్లు, వైఎస్సార్సీపీ పట్టణ కమిటీ కన్వీనర్ జె.ఆబేలు, కౌన్సిలర్లు దస్తగిరి, కలాం, ఖలీల్, కిషోర్, కుమార్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎస్ఏ జిలానీ, నాయకులు దండు శ్రీను, బండి రాజు, ప్రవీణ్, ఉగ్ర, మద్దిలేటి, మున్సిపల్ ఏఈ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.


బఫూన్లు భగత్‌సింగ్‌లు కాలేరు

● జగన్ పాదయాత్ర ఒక చరిత్ర.. లోకేష్‌ది నాటక యాత్ర
● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

కర్నూలు(రాజ్‌విహార్): సినిమా డైలాగులు చెప్పినంత మాత్రాన లోకేష్.. బఫూన్లు భగత్‌సింగ్‌లు కాలేరని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం స్థానిక సీ.క్యాంప్‌లో ఉన్న తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజా సంకల్ప యాత్ర ఓ చరిత్ర అని, మాజీ సీఎం చంద్రబాబు కుమారుడు చేస్తున్న యాత్ర నాటకమని ఎద్దేవా చేశారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు సీఎం జగన్ యాత్ర చేస్తే ముఖ్యమంత్రి అయ్యారు.. తాను చేస్తే అధికారంలోకి వస్తాననుకోవడం భ్రమ అన్నారు. ప్రజల బలం మెండుగా ఉన్న తమ పార్టీ అధినేతను ఎదుర్కోవడం ఎవరితరం కాదని, 2024లో 175 స్థానాల్లో గెలుపు సాధిస్తాని ధీమా వ్యక్తం చేశారు. దివంగత నేత వైఎస్ఆర్ మరణం తరువాత ఎన్ని ఇబ్బందులు పెట్టినా వెనకడుగు వేయకుండా 3648 కిలో మీటర్ల పాదయాత్ర చేసి చరిత్ర సృష్టించడం జగన్‌కే సొంతమన్నారు. లోకేష్ బాడీ లాంగ్వేజ్‌కి, డైలాగులకు పొంతన లేదని, ఆయన తల్లిదండ్రుల చాటు బిడ్డే తప్ప నాయకుడు కాలేదన్నారు. అతనిపై నమ్మకం లేకే మంగళగిరిలో ఘోరంగా ఓడించారని, ఎన్ని జిమ్మిక్కులు చేసిన టీడీపీని, చంద్రబాబును ప్రజలు నమ్మరని పేర్కొన్నారు.


హైందవ చైతన్యమే జగతికి శ్రీరామ రక్ష

● ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనంలో వక్తల పిలుపు


జ్యోతి ప్రజ్వలనతో ధార్మిక సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న మఠాధిపతులు

కర్నూలు కల్చరల్: హైందవ చైతన్యమే జగతికి శ్రీరామ రక్ష అని బళ్లారి ఉమామహేశ్వర పీఠం పీఠాధిపతి శ్రీ నిత్యానంద భారతి స్వామి అన్నారు. ఓల్డ్ సిటీలోని లలితా పీఠంలో శనివారం జరిగిన ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనంలో పలువురు పీఠాధిపతులు, స్వామీజీలు, వక్తలు పాల్గొని ప్రసంగించారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఎనిదోతరం వారసులు వీరంభట్లయ్య, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ, నాగలింగేశ్వర జీవైక్య మఠం మఠాధిపతి ఎల్లప్ప స్వామి, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి మాట్లాడారు. ఉగాది పర్వదినాన్ని శోభాయమానంగా జరుపుకోవడం, హిందూ కాలమానిని అనుసరించాలన్నారు. పాశ్చాత్య పోకడలు వీడి సంప్రదాయ బద్ధంగా పర్వదినాలను జరుపుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు హిందూ ధర్మం పట్ల ఆసక్తిని ఆపేక్షను మాత్రమే కాక అవగాహనను కలిగి ఉండాలన్నారు. ప్రతి మాతృమూర్తి సనాతన ధర్మాన్ని నేర్పాలన్నారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక దాస్, ఆవోపా జిల్లా అధ్యక్షులు యుగంధర్ శెట్టి, హనుమాన్ దీక్ష గురువు రామాంజనేయులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు నీలిమ, నాగరాజశర్మ, రామచంద్రారెడ్డి, టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


రగ్బీ విజేతలకు ట్రోఫీ, మెడల్స్ అందజేస్తున్న సమన్వయకర్త డాక్టర్ శ్రీదేవి

కర్నూలు (టౌన్): కర్నూలు నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో రెండు రోజులుగా జరుగుతున్న అంతర్ పాఠశాలల రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం సాయంత్రం ముగిసాయి. విజేతలుగా ఆదర్శ విద్యా మందిర్ (బాలుర జట్టు), పాణ్యం ఎస్టీ ఆశ్రమ పాఠశాల (బాలికల జట్టు) నిలిచాయి. ముగింపు కార్యక్రమానికి సాంఘిక సంక్షేమ శాఖ విద్యా సంస్థల సొసైటీ సమన్వయకర్త డాక్టర్ శ్రీదేవి అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గెలుపోటములు సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. నేటి ఓటమి రేపటి గెలుపుకు నాంది అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అండర్–17 బాలుర విభాగంలో ఆదర్శ విద్యా మందిర్, బాలికల విభా గంలో ఎస్టీ ఆశ్రమ పాఠశాల పాణ్యం జట్టు మొద టి స్థానం సంపాదించి ట్రోఫీతో పాటు పతకాలు కైవసం చేసుకున్నారు. అండర్ 11 బాలుర విభాగంలో ఆదర్శ విద్యా మందిర్, సి.బెళగల్ జట్లు వరుస గా మొదటి, రెండు స్థానాలు కైవసం చేసుకున్నా యి. బాలికల విభాగంలో కేజీబీవీ ఓర్వకల్లు, ఏపీ డబ్ల్యూఆర్ దిన్నెదేవరపాడు పాఠశాల విద్యార్థినులు మొదటి, రెండు స్థానాల్లో గెలుపొందారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం కార్యదర్శి రామాంజనేయ లు, వ్యాయమా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కుల ధ్రువీకరణ పత్రాలు

● అధికారులకు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశం
● చిన్నటేకూరు, లక్ష్మీపురం గ్రామాల్లో సచివాలయాలు తనిఖీ


బస్తిపాడు జగనన్న కాలనీ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అర్హులందరికీ కులధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సచివాలయ అధికారులను ఆదేశించారు. శనివారం కల్లూరు మండలం చిన్నటేకూరు, లక్ష్మీపురం బస్తిపాడు గ్రామాల్లో పర్యటించారు. ముందుగా లక్ష్మీపురం, చిన్నటేకూరు గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు. జగనన్న చేదోడు ద్వారా ఎంత మంది లబ్ధి పొందుతున్నారని ఆయా గ్రామాల సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రబీ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. అలాగే స్థానిక పాఠశాలల్లో మనబడి నాడు–నేడు కింద జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు.

ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. బస్తిపాడు గ్రామం జగనన్న లేఅవుట్‌ను సందర్శించి అక్కడ ఇళ్లను నిర్మించుకుంటున్న లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇసుక, ఇటుకలు, సిమెంట్ బయట మార్కెట్ ధరలకంటే తక్కువ ధరకు ఇస్తుందన్నారు. త్వరగా గృహాలను పూర్తి చేసుకోవాలన్నారు. చిన్నటేకూరు, బస్తిపాడు గ్రామల సర్పంచ్‌లు లక్ష్మన్న, రవి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కల్లావెంకట రమణారెడ్డి, తహసీల్దార్ టీవీ రమేష్ బాబు, హౌసింగ్ ఈఈ నాగరాజు, డీఈ కృష్ణమూర్తి, ఏఈ రమణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ శ్రీనాథ్‌రెడ్డి, ఈఓఆర్డీ రవి కిషోర్ పాల్గొన్నారు.

రేపు రాష్ట్ర స్థాయి జంప్ రోప్ పోటీలు

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లులో సోమవారం రాష్ట్ర స్థాయి జూనియర్ జంప్ రోప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బాలభారతి పాఠశాల ప్రిన్సిపాల్ క్లమేట్ సత్యబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పొదుపు లక్ష్మి ఐక్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక బాలభారతి పాఠశాలలో పోటీలు జరుగుతాయన్నారు. పాల్గొనే క్రీడాకారులు వివరాలకు 8790708391, 9014381589 సెల్ నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు


ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ దిల్షాద్

గూడూరు రూరల్: మండల పరిధిలోని జూలకల్ ఆదర్శ పాఠశాలలో శనివారం ఎనర్జీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యుత్, సోలార్ ఎనర్జీ సేవ్ ఫర్ ఫ్యూచర్ జనరేషన్ అనే అంశంపై చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రిన్సిపాల్ దిల్షాద్ ప్రశంసా పత్రంతో పాటు ప్రోత్సాహకాలు అందించారు.

ఇంటింటికీ కుళాయి కనెక్షన్

గూడూరు రూరల్: జల్ జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు అందించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సన పేర్కొన్నారు. పెంచికలపాడులో శనివారం తాగునీటి పథకాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని మునగాల, పెంచికలపాడు, బూడిదపాడు గ్రామాలు జల్ జీవన్ మిషన్ కింద ఎంపికై నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకుల ఏర్పాటుతో పాటు 100 శాతం ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత


విద్యార్థినికి స్టడీమెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

గడివేముల: గని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు శనివారం అదే గ్రామానికి చెందిన శ్యాంసుందర్ స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకటేశ్వర్లు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. బాగా కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి


మృతి చెందిన ఈరమ్మ (ఫైల్)

ఓర్వకల్లు: కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారిపై ఓర్వకల్లు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆరుగురిలో ఒకరు చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందారు. హైదరాబాద్ నుంచి ఒంటిమిట్టకు వెళ్తున్న కారు అదుపు తప్పి నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న తవేరా ప్యాసింజర్ వాహనాన్ని ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో రెండు వాహనాల్లోని శ్రీనివాసులు, జ్యోత్స్న, కనికె వెంకటేశ్వర్లు, మల్లకంటి ఈరమ్మ, మఠం మహేశ్వరమ్మ, నిల్లిబండ సుధాకుమారికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని పోలీసులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా మల్లకంటి ఈరమ్మ (84) అనే వృద్ధురాలు శనివారం కోలుకోలేక మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఆదోని పట్టణంలోని చిన్న మార్కెట్ సమీపంలో నివసించే మృతురాలు నంద్యాలలో బంధువుల గృహ ప్రవేశానికి వెళ్లి ప్యాసింజర్ వాహనంలో వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఈరమ్మకు ఇద్దరు కుమార్తెలు, కొడుకు సంతానం.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● వ్యాధి నిరోధక టీకాల అధికారి డా. ప్రవీణ్‌కుమార్


రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఓర్వకల్లు: ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఆసుపత్రిలో సిబ్బంది హాజరు పట్టిక, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి విధిగా ముఖ హాజరు వేయాలన్నారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బాలింతలు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అసంక్రమిత వ్యాధులను గుర్తించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు లేని పిల్లలను గుర్తించాలన్నారు. తీవ్రమైన పోషకాహారం లోపం గల పిల్లలను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎన్ఆర్‌సీ కేంద్రానికి రెఫర్ చేయాలని సూచించారు.

గొడవలకు దూరంగా ఉండండి


పోలకల్‌లో పల్లెనిద్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ పీరయ్య

సి.బెళగల్: చిన్న చిన్న విషయాలకు గొడవపడకుండా ప్రశాంత జీవనం గడపాలని కోడుమూరు సీఐ శ్రీధర్ ప్రజలను కోరారు. ఫ్యాక్షన్ గ్రామమైన పోలకల్‌లో శనివారం రాత్రి ఎస్ఐ పీరయ్య పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐ గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం ఎస్ఐ వివిధ చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లు, వివిధ కేసుల్లో అనుమానితులు, మద్యం నిందితులకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఆల్ ఇండియా పోటీల్లో 'ఆర్‌యూ' ప్రతిభ


మూడవ స్థానంలో నిలిచిన క్రీడాకారులను అభినందిస్తున్న వైస్ చాన్స్‌లర్ ఆనందరావు

కర్నూలు (టౌన్): ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు జలంధర్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో రాయలసీమ యూనివర్సిటీ జట్టు ప్రతిభ చాటి మూడవ స్థానం సాధించింది. దీంతో ఆర్‌యూ జట్టు క్రీడాకారులను యూనివర్సిటీ ప్రాంగణంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆనందరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత స్థాయి నుంచి అంతర్ విశ్వవిద్యాలయాల స్థాయిలో ఆర్‌యూ క్రీడాకారులు పతకాలే లక్ష్యంగా ఆటను ప్రదర్శించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఆల్ ఇండియా స్థాయిలో రాణించి ఖేలో ఇండియా పోటీలకు అర్హత సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ శివకిషోర్ పాల్గొన్నారు.